నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ భీమ లింగప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వివేక్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం వివేక్ నగర్ 1, 3, 4, ప్రతిభ డిగ్రీ కళాశాల, కమ్యూనిటీ హాల్, బాలాజీనగర్ పరిధిలోని న్యూ బాలాజీనగర్, కమ్యూనిటీ హాల్, వైఎస్ఆర్ విగ్రహం ప్రాంతం, హనుమాన్ ఆలయం, యోగ్యత అపార్టుమెంట్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్, పీపుల్స్ హాస్పిటల్ ప్రాంతం, వివేక్‌నగర్ రోడ్డు 1, 2, 3, 4, కాలేజీ, స్కూల్, ప్రతిభ డిగ్రీ కళాశాల, కమ్యూనిటీ హాల్, బాలాజీనగర్ పరిధిలోని ఒమిని హాస్పిటల్ ప్రాంతం, శ్రీ చైతన్య కళాశాల, వైఎస్ఆర్ విగ్రహం ఎదురుగా, చెన్ను అపార్టుమెంట్, బాలానగర్ నగర్ దర్గా, శాంతి నిలయం ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి కంప్యూటర్ సైన్స్ 1, కామర్స్ 1, బీబీఏ 1 బోధించడానికి అతిథి అధ్యాపకులుగా అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. పద్మావతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం ఉత్తీర్ణత తప్పని సరి అన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఎస్ఈటీ, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హతలు గల అభ్యర్థులు 25న సాయంత్రం 5 గంటల లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 26 మధ్యాహ్నం 2 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

31న ఎన్నికలు

ఆల్విన్‌కాలనీ: హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కో ఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, సొసైటీ కార్యవర్గ సభ్యుల ఎన్నికల షెడ్యూల్ శుక్రవారం విడుదలైంది. కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో ఈ నెల 31న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాలనీల్లో వసతుల కల్పనకు కృషి



బోరు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: కాలనీల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ సమత నగర్ కాలనీ పార్కు అభివృద్ధిలో భాగంగా బోరు పనులకు శుక్రవారం పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాయామం మన దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ఏ చిన్న సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, పార్కు వాకర్స్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో బ్రహ్మకుమారీలు రాజయోగ మెడిటేషన్ సెంటర్‌లో ఉమా ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సుమారు 100 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు మెడిటేషన్ సెంటర్ సభ్యులు రాజయోగిని, సరోజ బిహంజీ, ఉమా, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌చారి, డివిజన్ నాయకులు మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, మక్కల సత్యనారాయణ, కుమ్మరి బాలరాజ్, పి.మాధవరం యాదవ్, శ్యామ్, మోహన్, మహేష్, రాజుగౌడ్, కుమ్మరి బాలరాజ్, మల్లేష్ యాదవ్, చందు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆల్విన్‌కాలనీ: సీనియర్ పాత్రికేయుడు విద్యా వెంకట్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు.

స్థలాలను ప్రజా అవసరాలకు ఉపయోగించాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- హౌసింగ్‌బోర్డు వీసీకి వినతి





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఖాళీ స్థలాలను విక్రయించవద్దని, స్థానికంగా ప్రజల అవసరాలకు కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు హౌసింగ్ బోర్డు వీసీ గౌతమ్‌ను శుక్రవారం ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హౌసింగ్‌బోర్డు కమ్యూనిటీ హాల్‌ను ఆధునిక హంగులతో నిర్మించాలని, మహిళా పార్కు వద్ద జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ రోడ్డులోని ఖాళీ స్థలాన్ని పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం కేటాయించాలన్నారు. సిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని, చర్చి నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. అధికారి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రేపు మాజీ మంత్రి కేటీఆర్ రాక

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నరేన్ గార్డెన్‌లో జరుగనుందని, సమావేశానికి మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు నరేన్ గార్డెన్‌కు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రజలు విసుగెత్తిపోయారని, అస్తవ్యస్త నిర్ణయాలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలోనే బాగుందన్న అభిప్రాయం ప్రజల్లో ఉందని అన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసాపేట మున్సిపల్ సర్కిల్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ బస్తీలో ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలో నిరుపేదలు నివసిస్తున్నారని, వారందరికీ ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ఇస్తామని గతంలో చెప్పినేటికి ఇవ్వలేదన్నారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. చెరువు పక్కన రిటర్నింగ్ వాల్ నిర్మించాలన్నారు. 25న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున కదలాలని కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, రాఘవేంద్ర, శాఖ కార్యదర్శి ఎం. నరసింహ, నాయకుల నాగమణి, కృష్ణ వేణి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డును ఏర్పాటు చేసిందే కాంగ్రెస్

- ఎమ్మెల్యే ఆరోపణలు సరికాదు
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



కూకట్‌పల్లి: హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మి ప్రభుత్వం సొమ్ము చేసుకుంటుందని ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన ఆరోపణలు సరికాదని, బోర్డును కాంగ్రెస్ ఏర్పాటు చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సంక్షేమం కోసం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. బంగారు తెలంగాణ అంటూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి పోయారన్నారు. హౌసింగ్ బోర్డు ఏర్పాటు లక్ష్యం మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ గృహాలను వేల సంఖ్యలో నిర్మించి ఆయా వర్గాలకు అందజేసిందన్నారు. నేటికి ఇదే తరహాల బోర్డు ఇల్లు నిర్మిస్తుందన్నారు. హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేయడం ద్వారా వచ్చిన డబ్బును కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పేదల సంక్షేమం కోసమే వినియోగిస్తుందన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌తో అప్పుల పాలు

- చోరీల బాటపట్టిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- స్థానికుల దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

కేపీహెచ్‌బీకాలనీ: ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అప్పులపాలయ్యాడు. చోరీ చేసే క్రమంలో స్థానికులకు పట్టుబడగా దేహశుద్ధి చేసి కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన సుధీర్ బీటెక్ పూర్తి చేసి కేపీహెచ్‌బీ కాలనీలోని హాస్టల్‌లో ఉంటూ హైటెక్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడటంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎక్కువ కావడం, హాస్టల్ అద్దె చెల్లించకపోవడం వంటి ఇబ్బందులతో చోరీలు చేస్తూ డబ్బు సంపాదించాలని భావించాడు. హైదర్‌నగర్‌లోని రామ్‌నరేష్ నగర్‌ను ఎంచుకున్నాడు. రెండు రోజులుగా రెక్కీ నిర్వహించి శుక్రవారం ఉదయం కూరగాయలు కోసే కత్తి తీసుకుని పల్సర్ బైక్ మీద రామ్ నరేష్ నగర్‌కు వెళ్లాడు. ఆలయం పక్కనే ఉన్న మణెమ్మ అనే వృద్ధురాలి ఇంట్లోకి చొరబడ్డాడు. గమనించిన వృద్ధురాలు గట్టిగా కేకలు వేయడంతో అతను పారిపోయేందుకు యత్నించాడు. ఈ క్రమంలో చుట్టుపక్కల వాళ్లు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. వృద్ధురాలి మనవడు వికాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి

- భూ భారతి వచ్చినా గ్రామాల్లో భూ సమస్యలు
- భూ పోరాటాలపై కార్యాచరణ రూపొందించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఐ శ్రేణులు రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాజులరామారంలోని కామ్రేడ్ బాలమల్లేశ్ హాల్‌లో జరుగుతున్న సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలో శుక్రవారం ఆయన మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన చరిత్ర సీపీఐకే ఉందన్నారు. ఎర్రజెండా వద్దకు వెళితేనే తమకు నీడ దొరుకుతుందనే నమ్మకం నేటికీ పేదల ప్రజల్లో ఉండటం పార్టీకి గర్వ కారణమన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకునే విధంగా భూపోరాటాల ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ధరణి పోయి భూ భారతి వచ్చినప్పటీ క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని,. ఇప్పటికీ గ్రామ స్థాయిలో భూ సమస్యలు నెలకొన్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఉద్యమాలే ఊపిరి అని, ప్రజా సంఘాలను బలోపేతం చేసే దిశగా పార్టీ నాయకులు, శ్రేణులు కంకణబద్ధులు కావాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వ, ఫాసిస్టు పాలనను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీని ఎదుర్కొనేందుకు వామపక్ష పార్టీలు ఆచితూచి అడుగులు వేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

దుకాణంలో వెండి పట్టీలు చోరీ

జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తులు జ్యువెలరీ దుకాణంలో 500 గ్రాముల వెండి పట్టీలు ఎత్తుకెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ విమానపురి కాలనీకి చెందిన నరసింహాచారి అదే ప్రాంతంలో ధనలక్ష్మి నగల దుకాణం నడిపిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తెలిసిన వ్యక్తి నరసింహాచారికి ఫోన్ చేసి షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయని తెలిపాడు. వెంటనే అక్కడకు వెళ్లి చూడగా.. లోపల ఉన్న 500 గ్రాముల వెండి పట్టీలు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి



విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

ఆల్విన్‌కాలనీ: రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి వేడుకలు శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షులు గంగన్న, హనుమంత రెడ్డి, భగవంత రెడ్డి, దాకూరి తిరుపతిరెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సఫ్దార్‌నగర్ బస్తీలో కార్పొరేటర్ పర్యటన



కాలనీలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్‌లో శుక్రవారం కార్పొరేటర్ సబిహా బేగం అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు సీసీ రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ డీఈ ఆ మేరకు ఎస్టిమేషన్ సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అబ్దుల్ హమీవద్, షఫీ, సయ్యద్ రియాజ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు చేపట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీ సెల్ కో ఆర్డినేటర్ మదావత్ రమేష్ నాయక్

మోతీనగర్: కల్పతరువు అపార్టుమెంట్ నుంచి పాండురంగ నగర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరగా చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ మదావత్ రమేష్ నాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కల్పతరువు అపార్టుమెంట్ నుంచి బృందావనం అపార్టుమెంట్ మీదుగా పాండురంగ నగర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ అమిత్ రెడ్డి, నాయకులు రాజు గౌడ్ పాల్గొన్నారు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శుక్రవారం కొత్తకాపు హర్షితరెడ్డి, కొత్తకాపు రుచితారెడ్డి భరతనాట్య అరంగేట్రం చేశారు. ప్రదర్శనలో షణ్ముఖ కౌత్వం, అలరిపు, జతిస్వరం, శబ్దం, పదవర్ణం, నటనం, రామచంద్రభజన, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. శ్రీ నారాయణీయం నాట్యాలయంలో శిక్షణ పొంది. సంతోష్‌కుమార్ తమాంగ్ వద్ద శిష్యరికం చేశారు. కార్యక్రమానికి కర్నాటిక్ సంగీత గురువులైన డాక్టర్ మీనాక్షి పద్మనాభం, భరతనాట్యం గురువు డాక్టర్ పి.ఇందిరాహేమ, కూచిపూడి గురువు డాక్టర్ విజయ్‌పాల్ పత్లోత్ పాల్గొని కళాకారులను అభినందించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న కార్పొరేటర్ నరసింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అన్నారు. అంజయ్య నగర్ ప్రభుత్వ పాఠశాలలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ యూబీడీ మేనేజర్ శివజ్యోతి, సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో 75వ వన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, కుమ్మరి బాలరాజ్, నాగేష్, శ్రీనివాస్ రెడ్డి, మైపాల్ రెడ్డి, మోహన్ దేవేందర్, ఉమ, చందుయాదవ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

హస్మత్‌పేట్‌లోని బోయిన్‌చెరువులో జరిగే వినాయక నిమజ్జనం ఏర్పాట్లను కార్పొరేటర్ ముద్ద నరసింహ యాదవ్ విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎస్ఈ గోపయ్య, డీఈ గోపాల్‌రావు, ఏడీ శ్రీకాంత్, ఏఈ అఖిల్, ఏఈ మానిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

మాల బస్తీలో ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో పర్మినెంట్‌గా గణేశుని షెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ సొంత నిధులతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జై గణేష్ యూత్ అసోసియేషన్ ఓల్డ్ బోయిన్‌పల్లి కమిటీ సభ్యులు ప్రదీప్, టీవీఎస్ రవికుమార్, సత్యనారాయణ, నర్సింగరావు, సాయికిరణ్, సాయి ప్రసాద్, వినోద్, వెంకటేష్, నవీన్, శివ, శ్రీను, శ్రీకాంత్, జోసెఫ్, ఇమ్రాన్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు చేయూత అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళాసిల్క్ నిర్వాహకులు వినోద్‌జైన్ అన్నారు. మోతీనగర్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ప్రదర్శనకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగా ఎరిసిల్క్, బిహార్‌లోని భగల్పూర్ శిల్క్స్, టస్సర్, ఛత్తీస్‌గఢ్ ట్రిబిల్ వర్క్, కోసా శిల్క్, గుజరాత్‌లోని బాందని కచ్ఛ ఎంబ్రాయిడరీ డ్రెస్స్, శారీలు, జమ్ముకాశ్మీర్‌లోని శారీలు, డ్రెస్ మెటీరియల్స్, పాస్మీన్ శాల్, కర్ణాటకలోని క్రేప్, ప్రింటెడ్ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, మధ్య ప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్థాన్‌లోని కోటా, బంధాని, బ్లాక్‌ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్, డ్రెస్ మెటీరియల్స్, తెలంగాణలోని గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి ఉత్తరప్రదేశ్‌లోని జామ్దాని బనారస్ లక్నోవి డ్రెస్ మెటీరియల్స్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, హ్యాండీ క్రాఫ్ట్స్, బంజార, ఒరిస్సా పెయింటింగ్ హ్యాండీ క్రాఫ్ట్స్ వంటి అనేక వస్తువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొద్దిరోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు.

అమ్మవారికి లడ్డూలతో అలంకరణ



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి లడ్డూలతో అన్నపూర్ణాదేవిగా ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన చేశారు. లలితా సహస్రనామ అర్చనలు, లక్ష్మి, గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ, ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊరేగింపులకు ఆటంకం లేకుండా.. కేబుల్ వైర్లను తొలగిస్తాం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీ చర్యలను తీసుకోనున్నట్లు కూకట్‌పల్లి డీఈ జేఎల్ జనప్రియ తెలిపారు. కూకట్‌పల్లి విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలోని కేబుల్ వైర్ల తొలగింపు గణేష్ ఉత్సవాల సందర్భంగా విద్యుత్ శాఖ ఏర్పాట్లపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. అదనపు విద్యుత్ లోడ్ కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, భాగ్యనగర్ కాలనీ, మియాపూర్, ప్రగతినగర్ ప్రాంతాల్లో కేబుల్ వైర్లను గుర్తించి తొలగించామని వివరించారు. గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని ఊరేగింపులకు ఆటంకం లేకుండా కేబుల్ వైర్లను తక్షణమే తొలగిస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో తమ సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని వివరించారు. గణేష్ మండపాల నిర్వాహకులు స్థానిక సెక్షన్ కార్యాలయంలో ఏ ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారో సమాచారం ఇవ్వాలన్నారు. వారికి అవసరమగు విద్యుత్ సరఫరా మేరకు డీడీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ తీగల కింద గణేష్ మండపాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. నాసిరకం కాకుండా ఐఎస్ఐ బ్రాండ్ తీగలను వినియోగించాలని, తద్వారా ప్రమాదాలు జరగకుండా ఉండటానికి ఆస్కారం ఉంటుందన్నారు.

గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు

- విద్యుత్ కనెక్షన్లు అధికారికంగా మాత్రమే తీసుకోవాలి.
- ఓవర్ లోడ్ చేయకూడదు. జనరేటర్లు, ప్యానెల్లు, స్విచ్ బోర్డులపై అధిక లోడ్ వేయరాదు.
- కేబుళ్లు భద్రంగా అమర్చాలి. రోడ్డు మీద, నీరు నిలిచే ప్రదేశాల్లో వైర్లు పెట్టరాదు.
- ప్రమాద సమయంలో విద్యుత్ నిలిపివేయడానికి ప్రత్యేక స్విచ్ ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి కనెక్షన్‌కు సరైన ఫ్యూజ్, ఎర్తింగ్ తప్పనిసరిగా ఉండాలి.
- అత్యవసర పరిస్థితిలో ఉపయోగించడానికి అగ్నిమాపక పరికరం అందుబాటులో ఉంచుకోవాలి.
- ప్రమాదం జరిగితే వెంటనే 1912 కాల్ సెంటర్ లేదా స్థానిక విద్యుత్ కార్యాలయానికి తెలియజేయాలి.

జిల్లాలో అక్షరాస్యతను పెంచాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిలందరూ ముందుకొచ్చి బాధ్యతాయుతంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తెలిపారు. చదువుకు వయస్సు అడ్డంకి కాదని, ఒకరితో మోసపోవడం, ఒకరిపై ఆధారపడకూడదన్నారు. మహిళా సంఘాల గ్రూపు సభ్యులు చుట్టు పక్కల వారందరూ చదువుకునేలా చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలిపాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉల్లాస్ యాప్ నమోదులో చాలా వెనుకబడి ఉన్నామని, 47,867 లక్ష్యానికి 21,263 మాత్రమే పూర్తయిందని రాధికాగుప్తా పేర్కొన్నారు. డీఆర్డీఏ సాంబశివరావు, డీఈఓ విజయకుమారి, ఉల్లాస్ ప్రాజెక్ట్ అధికారులు, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, మూసాపేట మున్సిపల్ సర్కిళ్ల పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.